క్లుప్తంగా

సకాలంలో పన్నులు చెల్లించాలి



గ్రామస్తుల నుంచి పన్నులు తీసుకుంటున్న కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

కుల్కచర్ల: గ్రామ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి కోరారు. సోమవారం పలువురు గ్రామస్తుల నుంచి ఇంటి పన్నులు తీసుకొని మాట్లాడారు. గ్రామ పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. దుకాణ దారులు విధిగా వృత్తివ్యాపార అనుమతులు పొందడంతో పాటు.. సకాలంలో పన్నులు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి జానకీరాం, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతు చేపట్టాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పరిగి: గ్రామాలకు వెళ్లాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారని, గుంతలమయమైన రోడ్లను మరమ్మతు చేయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పీర్‌మహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లు ధ్వంసమై వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మరమ్మతుల కోసం నిధులు మంజూరైనా.. పనులు చేయించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రోడ్ల మరమ్మతు చేపట్టకుంటే సీపీఐ ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు జంగయ్య, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎంపీడీఓ పర్యటన



ఎర్రవల్లిలో పింఛన్ పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అనంతగిరి: వికారాబాద్ ఎంపీడీఓ సత్తయ్య సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. నారాయణపూర్‌లో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడి, ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం ఎర్రవల్లిలో పర్యటించి, అక్కడ పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం కంపోస్టు షెడ్‌లో ఎరువు తయారీపై ఆరాతీశారు. పులుమద్దిలో నర్సరీలోని మొక్కలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీఓ నాగరాజు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విహారయాత్రలతో విజ్ఞానం

కొడంగల్ రూరల్: విహారయాత్రలతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని హెచ్‌ఎం క్రాంతికుమార్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మూడు రోజులుగా విహారయాత్రలకు వెళ్లారు. ఇందులో భాగంగా యాదగిరిగుట్ట, వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, కాకతీయుల కోట, రామప్ప గుడి, లక్నవరం చెరువు, వరంగల్ పార్క్ తదితర ప్రాంతాలకు వెళ్లారు. చదువుతోపాటు కొంత సమయం విహారయాత్రలకు కేటాయించడం వలన విద్యార్థులకు మానసికోల్లాసం లభిస్తుందని చెప్పారు. వరంగల్ పార్క్ వెళ్లిన సందర్భంగా ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆనంద్ దేవనూరి, ఎల్‌బీహెచ్‌ఎస్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఉప్పలయ్య విద్యార్థులకు వసతి, స్నాక్స్, ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారని తెలిపారు. ఉపాధ్యాయురాలు సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి

పరిగి: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హెల్త్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున ప్రజలు ప్రజావాణిని, హెల్త్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోస్గి వెళ్తున్నారా.. జరభద్రం!

మలుపులు ప్రమాదాలకు పిలుపు
- జంకుతున్న వాహనదారులు
- నిత్యం వాహనాలతో రద్దీ
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు



వారం క్రితం అదుపుతప్పి బోల్తాపడిన డీసీఎం

దౌల్తాబాద్: మండల కేంద్రం నుంచి కోస్గి వెళ్లే డబుల్ రోడ్డుపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఎవరో ఒకరు రోడ్డు ప్రమాదానికి గురై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని వాపోయారు. వాహనాల రద్దీతో ఆ రహదారి నిత్యం రద్దీగానే ఉంటుందని, ఆ దారిగుండా వెళ్లాలంటేనే స్థానికులు, వాహనదారులు జంకుతున్నారని ప్రాంత వాసులు తెలిపారు. దౌల్తాబాద్ నుంచి చల్లాపూర్ మీదుగా కోస్గి వెళ్తున్నారా? జర భద్రం అని తమ వారికి కుటుంబీకులు చెప్పాల్సిన పరిస్థితి నెలకొందని, అంటే ఆ రోడ్డు పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దారిపొడవునా మలుపులే..

దౌల్తాబాద్ నుంచి చల్లాపూర్ మీదుగా కోస్గి వరకు 20 కిలోమీటర్ల దూరం ఉండగా.. మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయి. అయితే దౌల్తాబాద్ మలుపు నుంచి సురాయిపల్లి స్టేజీ వరకు నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. వారం రోజుల క్రితం ఓ మినీ డీసీఎం బోల్తాపడి ఒకరు మృతి చెందగా.. ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. అలాగే ఈ రోడ్డులో ఐదారేళ్లుగా సుమారు 20 మంది వరకు మృత్యువాత పడ్డారు. అనేక మంది క్షతగాత్రులుగా మిగిలారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఓ ఇన్నోవా కారు బైక్‌ను ఢీకొట్టగా.. ఒకరి కాలు విరిగింది. మండల కేంద్రంలో అన్ని శాఖల అధికారులు ఉన్నా.. ఏ ఒక్కరూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని, కలెక్టరైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



దౌల్తాబాద్ నుంచి కోస్గి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. మూలమలుపుల వద్ద వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నాయి. ఈ సంఘటనల్లో కొందరు చనిపోగా.. మరికొందరు గాయాలపాలయ్యారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– సాయిలు, దౌల్తాబాద్

టీడీపీ బలోపేతానికి కృషి

పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నర్సింహులు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహులు

దౌల్తాబాద్: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు పేదలకు డబుల్‌బెడ్రూం మంజూరు చేయలేదని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఇంటింటికీ తెలుగుదేశం అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. పార్టీ నాయకులు గ్రామాల్లో పర్యటించి ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బాలకిషోర్ యాదవ్, నాయకులు నారాయణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బంట్వారం: మండల కేంద్రం బంట్వారం శివారులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. బంట్వారం-సల్బత్తాపూర్ రోడ్డు మార్గంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డు పక్కనే చిన్నపాటి దిమ్మెపై ఏర్పాటు చేశారు. అటుగా నడుచుకుంటూ వెళ్లే వారు ఆదమరిస్తే అంతే సంగతులు. మూగ జీవాలకు కూడా ప్రమాదం పొంచి ఉందని, ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలని పరిసరప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మురళీకృష్ణగౌడ్ అరెస్టు అక్రమం



ఎమ్మెల్యే ఈటలను కలిసిన యాలాల మండల నాయకులు

యాలాల: మండలంలోని దేవనూరు ఘటనను కారణంగా చూపుతూ బీజేపీ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీగౌడ్ అరెస్టు అక్రమమని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోలుకుంది హన్మంతు వెల్లడించారు. సోమవారం నగరంలోని ఈటల నివాసంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతుతో పాటు జిల్లా కార్యదర్శి రామ్యానాయక్, మండల అధ్యక్షుడు మహిపాల్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ కలిసి మండలంలో శివస్వాముల ఘర్షణ, మురళీకృష్ణగౌడ్ అరెస్టు విషయాన్ని ఎమ్మెల్యేకు తెలిపారు. అధికార పార్టీ నాయకులు అక్రమంగా మురళిని అరెస్టు చేయించారని ఈటల దృష్టికి తీసుకువచ్చారు. ఈటలతో పాటు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసి శివ భక్తుల ఘటనను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణ, యాదప్ప, శంకర్‌రెడ్డి, అంజయ్య, వీరేశం, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహాపడి పూజ



మహాపడి పూజలో భక్తులు

పెద్దేముల్: శంభులింగేశ్వర దేవాలయం వద్ద సోమవారం ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. పెద్దేముల్ శివ స్వాముల బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజలో తాండూరు, మంబాపూర్, రుద్రారం, జనగాం, మారేపల్లి, కోటపల్లి, బంట్వారంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన శివ మాలధారులు, గురు స్వాములు పాల్గొన్నారు. శేఖర్‌గురు స్వామి పడిపూజను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రత్యేక తరగతులతో ప్రయోజనం


నందిగామ: 'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక తరగతులను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రమైన నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన సోమవారం అల్పాహారం అందజేసి మాట్లాడారు. ఉదయం 1 గంట, సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత మరో గంట పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారని చెప్పారు. ఉదయం వేళల్లో సరైన సమయానికి ఇంటి వద్ద అల్పాహారం చేయకుండానే కొందరు విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరు అవుతున్నారని, ఈ సమయంలో వారు ఆకలితో ఇబ్బంది పడకుండా తాను అల్పాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. పరీక్షల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల హెచ్‌ఎం దినేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 140 కేసులు పరిష్కారం

చేవెళ్ల: మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 140 కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యాయి. మండలకేంద్రంలోని చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో సోమవారం నాలుగవ రోజు రిటైర్డ్ జడ్జి సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో 140 కేసులు పరిష్కరించడంతో పాటు 3లక్షల 47వేల రూపాయాలు జరిమానాలు విధించడం జరిగిందని ట్రాఫిక్ సీఐ వాసు తెలిపారు. డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాల పరిధిలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 11వరకు కొనసాగుతుందన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ చందర్‌నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైన పటారం..

బడ్జెట్ పెద్దదే అయినా.. అంతా డొల్లతనమే: వక్తలు



కుల్కచర్ల: ఆంజనేయులు

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. చూడటానికి బడ్జెట్ భారీగా కనిపిస్తున్నా.. అంతా డొల్లతనమే అని.. ఆరేళ్లుగా బడ్జెట్ ప్రవేశపెట్టడం తప్పిస్తే.. అందుకు అవసరమైన చర్యలను తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్ పైన పటారం లోన లొటారంగా ఉందని విమర్శించారు.

దివ్యాంగులకు అన్యాయం



దోమ: ఆంజనేయులు

దోమ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వికలాంగుల సంఘం మండల మీడియా కన్వీనర్ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 పద్దులో దివ్యాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఐదు శాతం నిధులను కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సబ్బండ వర్గాల బడ్జెట్

బొంరాస్‌పేట: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ బడ్జెట్ ప్రవేశపెట్టారని మాజీ వైస్‌ఎంపీపీ శేరినారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రణాళికలో సంక్షేమ పాలన కోసం ఇంటి స్థలం ఉన్నవారికి రూ.3లక్షల నిధులు ఇచ్చి.. సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పడం హర్షణీయమన్నారు. సబ్బండ వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి పర్చేందుకు సీఎం కేసీఆర్ నిరంతరం కృషిచేస్తున్నారని చెప్పారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

- కంటి చూపును కాపాడుకోండి
- నేత్ర శిబిర కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు



తాండూరు టౌన్: కంటి పరీక్ష చేయించుకుంటున్న కౌన్సిలర్ సోమశేఖర్



దోమ: శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి

తాండూరు టౌన్: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ జన సమితి కౌన్సిలర్ సోమశేఖర్ అన్నారు. సోమవారం తన 34వ వార్డులోని విజయ విద్యాలయ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. అంధత్వ నివారణలో భాగంగా ప్రజలకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి శస్త్ర చికిత్స, కళ్లద్దాలు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో.. ప్రభుత్వం రెండో విడత కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోవాలి

దోమ: కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి లక్ష్మణ్ నాయక్ అన్నారు. దోమ మండల పరిధిలోని గొట్లచెల్కతండాలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటివెలుగుతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, అంధత్వాన్ని పూర్తి స్థాయిలో నివారించేందుకే సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

అవగాహన కల్పించాలి

కుల్కచర్ల: కంటివెలుగు గురించి ప్రజలకు వివరించాలని మండల వైద్యాధికారి వాజుద్దీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు. కుల్కచర్ల, బండవెల్కిచర్ల గ్రామాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాలను పరిశీలించి మాట్లాడారు. కంటి సమస్య ఉన్నవారు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దౌల్తాబాద్: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తిరుమలస్వామి చెప్పారు. మీటింగులో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని, సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

9,10న లబ్ధిదారుల ఎంపిక

ధారూరు: మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఈనెల 9,10 తేదీల్లో ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 2022-23 సంవత్సరానికి గాను అర్హులను గుర్తించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ధారూరులోని స్త్రీశక్తి భవన్‌లో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. 9న ఎస్‌బీఐ ధారూరు, 10న ఎస్‌బీఐ నాగసమందర్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు నాగారం బ్యాంకులో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో అభ్యర్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా గంగతెప్ప ఊరేగింపు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంగతెప్ప ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో భాగంగా సమీపంలోని చెరువులో గంగతెప్పను వదిలారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల మాట్లాడుతూ.. నేడు (మంగళవారం) జరగనున్న బోనాల ఉత్సవాలను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ గ్రామాలు, ప్రాంతాలు జంట నగరాల నుంచి వచ్చిన భక్తులు వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యుత్ దీపాలు, అమ్మవారి ఫ్లెక్సీలు, బ్యానర్లు భక్తి పాటలతో మార్మోగాయి. ఉత్సవంలో రవియాదవ్, శివయ్య, మహేందర్ యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర సర్పంచుల సంఘం మహిళా అధ్యక్షురాలు, కేతిరెడ్డిపల్లి సర్పంచ్ దారెడ్డి శోభావెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలో కేతిరెడ్డిపల్లి గ్రామంలో హెచ్‌ఎండీఏ నిధులతో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధిలో గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమన్నారు. కలిసికట్టుగా కృషి చేస్తే గ్రామం ఆదర్శంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గత నాలుగు సంవత్సరాలుగా గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ మురుగు కాలువలు, ఇంటింటికి నల్లా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. మిగిలిన అభివృద్ధి పనులు దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, కారోబార్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపసర్పంచ్ సిద్ధయ్య, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు నర్సింగ్, అనిమోనీ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదువుకోవాలి



పుస్తకాలతో పదో తరగతి విద్యార్థులు

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

బంట్వారం: పరీక్షల సమయంలో విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి అన్నారు. ఎస్‌వీఆర్ ఫౌండేషన్ తరఫున సోమవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని బార్వాద్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి మాట్లాడారు. పరీక్షల సమయం దగ్గర పడుతుందని, బాగా చదువుకొని మంచి గ్రేడ్‌లు సాధించాలంటూ ఆయన విద్యార్థులకు సూచించారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. పాఠ్యాంశాల్లో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఉన్నతస్థితికి చేరుకోవాలని నరేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ వెంకటరత్నం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ చైర్‌పర్సన్'కు 15 ఫిర్యాదులు

అనంతగిరి: డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమానికి రెండు వారాలుగా.. నిధులతో కూడిన సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ సమస్యలకు వచ్చే బడ్జెట్‌లో మొదటి ప్రాధాన్యత ఇస్తామని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. మున్సిపల్‌లో నిర్వహించిన డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమానికి 15 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ప్రధానంగా సీసీ రోడ్డు, నూతన డ్రైనేజీల నిర్మాణాలు, కరెంట్ సమస్యలు, రోడ్డుకబ్జా చేస్తున్నారంటూ ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


చెట్టు.. ఆకట్టుకునేట్టు!

చూడటానికి చెట్టే.. కానీ ఓపిగ్గా ఓసారి చుట్టేస్తే.. ఏదో ఒక ఆకారం కనిపిస్తుంది. ప్రకృతిలోని ప్రతి చెట్టును మనసుపెట్టి చూడాలేకానీ.. మనకు తెలిసిన ఆకారం కనిపించి కనువిందు చేస్తుంది. బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల్లో పలు ఆకృతుల్లో కనిపించిన ఈ వృక్షాలను సోమవారం 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– బొంరాస్‌పేట్



బుర్రితండాలో.. గద ఆకారంలో మద్ది చెట్టు



హంసాన్‌పల్లి శివారులో.. పిరమిడ్ (త్రిభుజం)ఆకారంలో విప్ప చెట్టు